ప్రజాశక్తి

సోమవారం 17 జులై 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా





రాయితీ కొంతమందికే..!



మచిలీపట్నం రైతుబజారులో టమాట కోసం బారులు తీరిన ప్రజలు

వారంలో రెండు రోజులే కిలో టమాటా రూ.50కి పంపిణీ

రైతుబజార్లలో నాల్గో వంతు మందికే సరఫరా

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వరుసలో ముందున్న వారికే రైతుబజార్ల ద్వారా విక్రయిస్తున్న రాయితీ టమోటా దక్కుతోంది. వినియోగదారులకు అవసరమైన మొత్తంలో టమాటా సరఫరా చేయకపోవడంతో కొందరికే అందుతున్నాయి. దీంతో వినియోగదారులు నిరాశ చెందుతున్నారు. వినియోగదారులకు తగిన మొత్తంలో రైతు బజార్లకు టమోటా సరఫరా చేయాలని కోరుతున్నారు.

టమోటా ధరలు బహిరంగ మార్కెట్‌లో చుక్కలనంటాయి. కిలో రూ.120 వరకు విక్రయిస్తున్నారు. స్వయం సహాయ సంఘాల ద్వారా రైతు బజార్లలో రాయితీపై టమోటాను సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలోని మెయిన్, రాజుపేట రైతుబజార్లతో పాటు గుడివాడ, పెడన, కంకిపాడు, గన్నవరం, పెడన, చల్లపల్లి, కూచిపూడి తదితర రైతుబజార్లకు వారంలో రెండు రోజులు మంగళ, శనివారాల్లో మాత్రమే సరఫరా చేస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు మాత్రమే ప్రభుత్వం వినియోగదారులకు అందించింది. సరఫరా చేసిన రోజుల్లోనూ పూర్తిస్థాయి అవసరాలకు తగినంతగా రైతు బజార్లకు కేటాయించడం లేదు. ఒక్కో రైతు బజారుకు సగటున వెయ్యి కిలోలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఒక్కో వినియోగదారునికి కిలో చొప్పన ఆధార్, ఫోన్ నెంబర్లను పరిగణనలోకి తీసుకుని రూ.50కి విక్రయిస్తున్నారు. అయితే వినియోగదారులు సంఖ్య ఎక్కువగా ఉండటంతో వరుసలో ముందు నిలబడిన వారికే అందుతున్నాయి. మచిలీపట్నం మెయిన్, రాజుపేట రైతు బజార్లకు రోజుకు సగటున ఐదు వేల మంది వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తారు. టమోటా ధరలు కిలో రూ.20 నుంచి 30 మధ్యలో రోజువారీ 200 ట్రేలు (ఒక్కో ట్రే 25 కిలోల చొప్పున మొత్తం ఐదు టన్నులు) చొప్పున బుధవారం సెలవుపోను మిగిలిన ఆరు రోజుల్లో 30 టన్నులు విక్రయాలు జరుగుతాయి. రాయితీపై వారంలో రెండు రోజులు రెండు టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో ఉదయం వేళ రైతు బజార్లల్లో రద్దీ తగ్గిన తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు స్టాల్స్‌లో రాయితీ టమోటా విక్రయిస్తున్నారు. మూడు గంటల్లోనే విక్రయాలు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయితీ టమోటా సరఫరాను పెంచాలని వినియోగదారులు కోరుతున్నారు.

కోగంటి సత్యం అనుచరుడు

శ్యామ్ అనుమానాస్పదస్థితిలో మృతి

ప్రజాశక్తి-విజయవాడ



కోగంటి సత్యం ప్రధాన అనుచరుడు టెక్కం శ్యామ్‌సుందర్ (54) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శ్యామ్ మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణలంక ఎస్‌ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణలంక 22వ డివిజన్ సత్యం దొడ్లో శ్యామ్‌సుందర్ వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. శనివారం సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల్లోపు భార్య ఇంట్లో లేని సమయంలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. శ్యామ్‌పై ఎపి, తెలంగాణి రాష్ట్రాల్లో పలు కేసులు నమోదయ్యాయి. శ్యామ్‌ను హత్య చేసి ఉంటారని భార్య, సోదరుడు అనుమానిస్తున్నారు. శ్యామ్ కొడుకు గణేష్‌వర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. తన తండ్రి శరీరంపై గాయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే అతను గుండెపోటుతో మృతిచెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో తేలిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.



లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి

7వ పేజీ




ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

కార్మికుని కుటుంబానికి పరిహారం

- రెండో రోజూ ఆందోళనతో దిగొచ్చిన అధికారులు
- రూ.25 లక్షలు, ఉద్యోగం, ఇల్లు ఇస్తామని హామీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విజయవాడ బాడవపేటలోని జక్రయ్య వీధిలో భూగర్భ డ్రైనేజి మరమ్మతుల నిమిత్తం మ్యాన్‌హోల్లో పడి మృతిచెందిన నగరపాలక సంస్థ కార్మికుడు మేడా మాణిక్యాలరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రెండో రోజు ఆదివారమూ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. శనివారం జరిగిన సంఘటనతో మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ సిఐటియు, మునిసిపల్ కార్మికుల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కొనసాగడంతో మునిసిపల్ అధికారులు దిగొచ్చారు. మున్సిపల్ కార్మికులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం, ఇల్లు, ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిఐటియు నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.డేవిడ్, అధ్యక్షులు జ్యోతిబసు, టి.ప్రవీణ్, నిమల నరేంద్ర, సరసరాజు, పామర్తి శ్రీను, బత్తుల బ్రహ్మయ్య, జె.రావు, సిఐటియు నాయకులు ఎన్.కోటబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న సిఐటియు నాయకులు

విస్తృతంగా 'ఫిష్ ఆంధ్రా' అమలు

- ఔత్సాహిక వ్యాపారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ నాగరాజ





ప్రజాశక్తి-విజయవాడ: ఫిష్ ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసే దానిలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ పథకాన్ని విస్తృత స్థాయిలో తీసుకెళ్లడానికి బహుముఖ కార్యక్రమాలు చేపట్టినట్లు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ (డిడి) ఎ.నాగరాజ చెప్పారు. ఫిష్ ఆంధ్రా స్కీమ్ కింద పరిశుభ్రమైన వాతావరణంలో షాపులు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ వివిధ పద్ధతుల ద్వారా చేపల విక్రయాన్ని పెంచడంతో పాటు ఫిష్ కర్రీ, ఫ్రై పాయింట్స్‌ను విస్తృతస్థాయిలో ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహించడానికి బ్యాంకుల ద్వారా పెట్టుబడుల మంజూరుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మత్స్యసంపద అభివృద్ధి, వ్యాపారం, వినియోగం, ప్రభుత్వాల చర్యలు తదితర అంశాలను నాగరాజు 'ప్రజాశక్తి'కి వివరించారు.

ప్రశ్న: 'ఫిష్ ఆంధ్రా' స్కీమ్ ఉద్దేశాన్ని వివరించగలరు?

జవాబు : మంచి పోషక విలువలు కలిగిన చేప వినియోగాన్ని పెంచడానికి ప్రభుత్వం వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టింది. దీనిలో భాగంగానే ఔత్సాహిక వ్యాపారులకు సబ్సిడీల రూపంలో రుణ సదుపాయం కల్పించడం, మార్కెట్ వనరులను చూపించడం, వాహన సదుపాయం, షాపుల ఏర్పాటు తదితర రూపాల్లో ప్రభుత్వం ప్రోత్సహించడం జరుగుతుంది. దీనిని పెద్ద ఎత్తున రాష్ట్రంలో చేపట్టిన ప్రభుత్వం, ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఫిష్ ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నేతృత్వంలో నిర్వహించడం జరుగుతుంది. చేప వినియోగం పెరిగితే ఆరోగ్యంగా ఉండవచ్చని, మంచి సమాజం రూపుదిద్దుకుంటుందని ప్రభుత్వ ఉద్దేశం.

ప్రశ్న: ఔత్సాహిక వ్యాపారులకు ప్రభుత్వ పరంగా రుణ సదుపాయం ఎలా ఉంటుంది?

జవాబు: ఫిష్ మార్కెట్ కోసం ఒక్కొక్క షాపు రూ.20 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసుకుంటే దానిలో లబ్దిదారుడి వాటా సొమ్ము రూ. 15 శాతం, అలాగే ఎస్‌సి, ఎస్‌టిలకు 60 శాతం, ఇతరులకయితే 40 శాతం చొప్పున ప్రభుత్వ పరంగా సబ్సిడీ ఇస్తూ మిగిలిన సొమ్మును బ్యాంక్ ద్వారా లోను సదుపాయం కల్పిస్తుంది.

ప్రశ్న: మార్కెట్ కోసం ప్రస్తుతం జిల్లాలో ఎన్ని షాపులను ప్లాన్ చేశారు?

జవాబు: ప్రస్తుతం 15 షాపులు ప్లాన్‌లో ఉన్నాయి. వీటిల్లో గొల్లపూడి, రాఘవయ్య పార్కులో ఫిష్ మార్కెట్ వ్యాపారం కోసం ఏర్పాటు చేసిన షాపులు ఇప్పటికే రన్నింగ్‌లో ఉండగా, మరో రెండు షాపులు ఈ వారంలో రన్నింగ్‌లోకి వస్తాయి. ఇంకొక మూడు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కాకుండా రూ.లక్ష నుంచి మూడు లక్షల వరకు విక్రయాల సామర్థ్యం కల్గిన చిన్న షాపులు జిల్లా వ్యాప్తంగా 231 ఏర్పాటు చేయడం జరుగుతుంది. 90 షాపుల్లో ఇప్పటికే 60 షాపులకు ప్రభుత్వం సైట్ మంజూరు చేసింది. ఫెర్రీలో చిరు వ్యాపారులకు 45 షాపులు, పున్నమి ఘాట్‌లో 12, తిరువూరులో 30 షాపులు, జగ్గయ్యపేట 17 చొప్పున ఇవ్వడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.10 లక్షల అంచనా విలువ కల్గిన పెద్ద షాపులు 30 ఏర్పాటు చేయాలని టార్గెట్ కాగా, రూ.20 లక్షల అంచనా వ్యయం కల్గినవి మరో 14 షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది.

ప్రశ్న: జిల్లాలో ఫిష్ సొసైటీలు ఎన్ని ?

జవాబు: జిల్లాలో 86 సొసైటీలున్నాయి. వీటిల్లోని సభ్యులు 3,816 కాగా, లైసెన్స్ కలిగి చేపలు పట్టుకునే వారు మరో నాలుగు వేల మంది ఉంటారు. చేపల చెరువులు 137 వరకు జిల్లాలో ఉన్నాయి.

ప్రశ్న: కృష్ణా కెనాల్‌లో మత్స్య సంపద ఎంత ఉంటుంది?

జవాబు: కృష్ణా కెనాల్‌లో ఏడాదికి చేపలు వంద టన్నుల వరకు, రొయ్య పది టన్నులు, వ్యాపారం టర్నోవర్ ఏడాదికి రూ.మూడు కోట్ల వరకు ఉంటుంది. ప్రత్యక్షంగా పది వేల మంది, పరోక్షంగా మరో 30 వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ



ప్రజాశక్తి-నందిగామ : సమాజంలో పలు రంగాల్లో దశాబ్దాల కాలంగా లైన్స్ క్లబ్ ముందు నిలుస్తుందని జిల్లా మాజీ న్యాయ మూర్తి గూడూరు రామకృష్ణ పేర్కొన్నారు. నందిగామ లైన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నందిగామ లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ కొండాలరావు చిన్న, కార్యదర్శిగా కె. లక్ష్మీకాంత్, కోశాధికారిగా ఎం. ప్రసాదు లతోపాటు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా మాజీ న్యాయమూర్తి గూడూరు రామకష్ణ నూతన లైన్స్ క్లబ్ సభ్యులను అభినందిస్తూ సమాజ హితవు సేవలు అందించాలని సూచించారు. ఈ ఏడాది క్లబ్లో ఇద్దరు డాక్టర్లు ఉండటం విశేషం అని తెలిపారు. నూతన క్లబ్ సభ్యులను శాలువాతో సత్కరిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా ప్రతినిధులు ఆర్ రామారావు, జి. శేషగిరిరావు, తోర్లికొండ సీతారామయ్య, రామిరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

దద్దోజనం, పులిహోర, జిలేబి పంపిణీ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని వాసవి క్లబ్ కపుల్స్ వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొత్త పద్మావతి 68వ జయంతి సందర్భం గా ఆదివారం కొత్త పురుషోత్తం షాపు వద్ద పేదలకు దద్దోజనం, పులి హెూర, జిలేబి పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, కష్ణా జిల్లా వైద్య కమిటీ చైర్మన్, వాసవి క్లబ్ కపుల్స్ గౌరవ సలహాదారులు కొత్త పురుషోత్తం, వీరి కుమారులు మండల ఆర్యవైశ్య వైస్ ప్రెసిడెంట్ కొత్త సురేష్ కుమార్, వాసవి క్లబ్ కపుల్ సెక్రటరీ కొత్త రమేష్ కుమార్, అర్ సి కొత్త కష్ణారావు, అర్ ఎస్ కర్లపాటి వెంకటేశ్వర్లు (కొండ), వాసవి క్లబ్ కపుల్స్ ప్రెసిడెంట్ పెనుమూడి సత్యనారాయణ, సెక్రటరీ కొత్త రమేష్ కుమార్, ట్రెజరర్ బి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు రక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగనన్న సురక్ష పేదలకు రక్ష అని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. శనివారం రాత్రి జగ్గయ్య పేట పట్టణం 14వ సచివాలయం (30,31 వార్డ్ లు) మరియు 6వ సచివాలయం (16,17 వార్డ్ లు) లలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, హాఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ,యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రామయ్య, షేక్ మునిహేర, వార్డు గహసారథులు,వార్డు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గంజాయి అమ్ముతున్నారన్న సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఎనిమిది కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఆదివారం అరెస్టు చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ రూరల్ అంబాపురం పంచాయితీ హెచ్.పి పెట్రోల్ బంక్ వెనుక గంజాయి కలిగి అమ్ముతున్న సమాచారంపై లంబాడీపేట, చిట్టినగర్‌కు చెందిన దోళవాష్ సాయితేజ, కలరా హాస్పటల్. వి.ఎం.సి కాలనీకి చెందిన అల్లం రాఘవేంద్ర, ఆంజనేయవాగు సెంటర్‌కు చెందిన కోసూరి చిన్న అనంత్ కుమార్, సాయిరాం సెంటర్‌కు చెందిన ఈగల దుర్గా శ్రీకాంత్‌లను ఆదివారం ఉదయం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ సుబ్రహ్మణ్యంకు రాబడిన సమాచారం మేరకు 8 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ పోటీలకు బాబూరావు

దాతల కోసం ఎదురుచూపులు



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం రోలుపడికి చెందిన కందుల బాబూరావు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, టీవీ సీరియళ్ళలో నటుడిగా పేరొం దారు. ఇప్పటికి 250 సినిమాల్లో నటించిన బాబూరావు పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ కూడా త్వరలో దుబాయ్ లో జరిగే అంతర్జా తీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనే అరు దైన అవకాశం కూడా వచ్చింది. అయితే ఎవరైనా దాతలు సహకరిస్తేనే తాను ఇండి యా తరపున అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని బాబూరావు చెబుతున్నారు. కాబట్టి దాతలు తనకు ఈ పోటీలలో పాల్గొనేందుకు సహకరించాలని కోరుతున్నారు.

మద్దులమ్మకు యాత్రికులు తాకిడి



ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల మండలం గొట్టుముక్కల అటవీ ప్రాంతంలో గల మద్దులమ్మ దేవాలయంలో ఆదివారం మహిళలు ఆషాడ మాసం పూజలు నిర్వహించారు. కంచికచర్ల, వీరులపాడు మండలం మండలాలు, విజయవాడ పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చారు. దేవాలయ ప్రాంగణంలో పాలు పొంగళ్ళు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో నుండి జాలువారే జలపాతాల అందాలను ఆశ్వాదించారు. మద్దులమ్మ దేవాలయానికి యాత్రీకుల తాకిడి పెరగటంతో ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. గొట్టుముక్కల నుండి అటవీ ప్రాంతంలో మద్దులమ్మ దేవాలయం వరకు రోడ్డు అభివృద్ధి చేస్తుండటంతో రాబోయే కాలంలో మద్దులమ్మ దేవాలయానికి యాత్రీకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - గంపలగూడెం: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తోనే ఈ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు గ్యారంటీ అని తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చేవల దేవదత్ అన్నారు. ఆదివారం సాయంత్రం గంపలగూడెం కురుమ బజారులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న దత్తు ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాజా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ మృతి



ప్రజాశక్తి-నందిగామ : నందిగామ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మాడుగుల నాగరత్నమ్మ (70) అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు. గత మూడు నెలలుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు.ఆమె మృతి వార్త తెలిసిన హుటాహుటిన విజయవాడ ఆసుపత్రికి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ దంపతులు చేరుకొని నివాళులర్పించారు. మాడుగుల నాగరత్నమ్మకు భర్త రత్తయ్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాగరత్నమ్మ రెండు సార్లు కౌన్సిలర్‌గా గెలుపొందారు. నందిగామ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మీ అనారోగ్యంకు గురైన సమయంలో నాగరత్నమ్మ ఆపధర్మ చైర్ పర్సన్ గా వ్యవహరించారు. నందిగామ అభివృద్ధి కి ఆమె ఎంతో సేవలు అందించారు. 7వ వార్డు కౌన్సిలర్‌గా పలు అభివృద్ధి పనులు చేశారు. నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్రావు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్‌కు నమ్మినబంటుగా వ్యవహరించారు. అందరిని అప్యాయంగా పలకరించే వారు. నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు నివాళు లు అర్పించారు. పలువురు వైసీపీ నాయకులు నాగరత్నమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు.



'పోతిన మహేష్ ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి - భవానీపురం : తమ పాలకవర్గం ఎటువంటి అవినీతిని ప్రోత్సహించలేదని, తమపై పోతిన మహేష్ అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం) పాలక మండలి మాజీ ఛైర్మన్ పదిలం రాజశేఖర్, పలువురు కమిటీ సభ్యులు ఆరోపణలను ఖండించారు. ఆదివారం భవానీపురంలోని పదిలం రాజశేఖర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పదిలం రాజశేఖర్ మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యులు వెలంపల్లిపై జనసేన నాయకుడు పోతిన మహేష్ చేసే తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. పాత శివాలయంలో అవినీతి జరిగిందని దానిలో పాత పాలక మండలి వారికీ, మాజీ మంత్రి వెలంపల్లికి భాగస్వామ్యం వుందని చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో మాజీ ధర్మకర్తలు ఫణుకు ఫణింద్ర దూండి, బండారి వెంకట్ , డి వి రెడ్డి, వి. అనిత పాల్గొన్నారు.





రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా పెంచుతామని వెస్ట్ ఎ.సి.పి. కె. హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వెస్ట్ ఎ.సి.పి. హనుమంతరావు, సిఐ సుబ్రహ్మణ్యం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురిచేయటం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించ కుండా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం నిఘా వుంటుందన్నారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పి.డి. యాక్ట్ పెట్టి నగర బహిష్కరణ కూడా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు ఆపేందుకు కుట్ర

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరుపేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆపేయాలన్న కుట్ర జరుగుతుందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను అన్నారు. ఆదివారం ఉదయభాను స్వగహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఓరవలేని చంద్రబాబు అండ్ కో అడుగడుగునా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెల్లవారక ముందే అవ్వ తాతల వద్దకు వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వాలంటీర్ వ్యవస్థ మీద కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్లో పవన్ కళ్యాణ్ డ్రామాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వాలంటీర్ల పై పవన్ కళ్యాణ్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు.

రామలింగేశ్వరస్వామికి అభిషేకం

ప్రజాశక్తి - గన్నవరం : అషాడమాసం సందర్భంగా కేసరపల్లి గ్రామంలో ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం దేవస్థానం పూజారి కుందుర్తి సుధాకర శర్మ అధ్వర్యంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా రామలింగేశ్వర స్వామి కి పంచామతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ జరిపారు. అనంతరం లిఅమ్మవారికి పసుపు కుంకుమ చీర గాజులు వివిధ రకాల పూలు పండ్లు స్వీట్లు చెఱకు గడలతో అషాడమాసం సారె సమర్పించటం జరిగినది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

28 నుంచి మహిళా బస్సుయాత్ర : ఐద్వా



పెనమలూరు : తాడిగడప మున్సిపాలిటీ ఐద్వా మహిళా సంఘం విస్తత సమావేశం ఆదివారం కార్మికుల కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కష్ణాజిల్లా ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి జ్యోతి పాల్గొని మాట్లాడుతూ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళ బస్సు జాత ఈనెల 28 నుండి ఆగస్టు 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల మీద రోజురోజుకు హింస పెరుగుతోందని, దీనికి ప్రధాన కారణం మద్యం మత్తు పదార్థాల వల్లనే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు మద్యాన్ని దశలవారీగా నియంత్రిస్తామని మహిళలకు హామీ ఇచ్చి నేడు షాపులను తగ్గించకుండా విక్రయం పెరిగింది అన్నారు. మద్యాన్ని ప్రధానాదాయ వనరుగా చూడటం వల్లనే షాపులు పెరుగుతున్నాయన్నారు. గంజాయి మత్తు పదార్థాలు స్కూల్ స్థాయి వరకు విస్తరించి బాలలు, యువత తప్పుదారి పట్టడానికి కారణం అవుతుందన్నారు. మహిళలపై రోజురోజుకి పెరుగుతున్న దాడులను అరికట్టడాలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కావున మహిళల రక్షణ కోసం జరిగే ఈ యాత్రలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల కార్యదర్శి పాతాళ లక్ష్మి, నాయకులు రవణమ్మ ,సరళ, భవాని, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమ వరం గ్రామంలో వేంచేసియున్న కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీచ్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మ కర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ఏర్పాట్లు పరిశీలించారు.

అసైన్డ్ భూములకు హక్కు కల్పించడం పట్ల హర్షం

ప్రజాశక్తి-గన్నవరం : అసైన్ భూములకు హక్కు కల్పిస్తూ సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం గొప్ప విషయమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం గన్నవరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడంతో పాటు ఆక్రమిత భూములపై హక్కులు కల్పించడంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ అయిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోను వైసీపీ విజయం తథ్యం అన్నారు. ఈ కార్యక్ర మంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్షతగాత్రునికి మైత్రీ ఫౌండేషన్ చేయూత



సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన చేనేత కార్మికులు పేరిశెట్టి విఘ్నేశ్వరరావు 20 రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి 2 చోట్ల కాలి ఎముక విరిగిపోవడంతో మంచానికి పరిమితమైయ్యారు. పనులు చేసుకునే వీలు లేక ఇల్లు కూడా గడిచే పరిస్థితి లేకపోవడంతో స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి 2 నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు, 1500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వెణుకుమార్, కార్యదర్శి రాధా కష్ణ, సభ్యులు బి బి ఎస్ ప్రసాద్, చెంచయ్య,రమాదేవి, తేజ,పవన్,మోబిన్, యేసు తదితరులు పాల్గొన్నారు.



260 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు రోటరీక్లబ్, రోటరీ హాస్పిటల్, అనూ హాస్పిటల్, ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆ ఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఆదివారం పెదఓగిరాలలో ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహి చిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 260 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అంద జేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర రావు వైద్యశిబిరాన్ని ప్రారంభించి క్లబ్ చేసు న్న సేవాకార్యక్రమాలను తెలియజేశారు. గుండె, ఎముకలు, నరాలు, కేన్సర్, కంటి, దంతల విభాగాలు సాధారణ వ్యాదుల వైద్యులు పాల్గొని వైద్యపరీక్షలు చేశారు. క్లబ్ సెక్రటరీ సుబ్రమణ్యం, గ్రామసర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ నాగిరెడ్డి, కేసీపీ మేనే జ పున్నారావు, వసంతరావు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి- ఉయ్యూరు : ఉయ్యూరు రూరల్ స్టేషన్ పరిధి ఆకునూరు గ్రామం సమీపాన మూర్తి రాజుపాలెండొంకలో ఆదివారం కోడిపందేలు వేస్తున్న ఆరుగురిని అరెస్టుచేసి చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారివద్ద నుండి రూ. 2వేలు నగదు, కోడిపుంజు, రెండు కోడికత్తులు స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు..

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- ఉయ్యూరు : ఆరోగ్యానికి నడక, వ్యాయామం, యోగావంటి వాటిపై అవగాహన కల్పిస్తూ అసోసియే ద్వారా సేవలు మరింత విస్తత పరచి ఉత్తమ అసోసియేషన్తో పాటు జిల్లా అ సోసియేషన్కు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 202 గవర్నర్ డీవీ ఎస్. రామలింగరాజు అన్నారు. ఏజీఅండ్ ఎస్-ఎస్ కళాశాల వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో కడవకొల్లులో వడ్డేబసవ రాజ్యం చారిటబుల్ ట్రస్టు కమ్యూనిటీ హాల్ లో ఆదివారం జిల్లా క్యాబినేట్ సమావేశం నిర్వహించారు. ఈకార్య క్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ల ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సెక్రటరీ ప్రసాదరావు, ట్రెజరర్ సాయిబాబా, మాజీ గవర్నర్ నూకల సాంబశివరావు, డిప్యూటీ గవర్నర్ సీహెచ్ బాపిరాజు, ఉయ్యూరు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సెక్రటరీ పూర్ణచంద్రరావు, ట్రెజరర్ పూర కిషోర్ పాల్గొన్నారు.



భవన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : బిల్డింగ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సిఐటియు అనుబంధ సంస్థ బిల్డింగ్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు అవనిగడ్డ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 1214 మెమోను రద్దు చేసి సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న క్లైములు కార్డులు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం మళ్లించిన 1280 కోట్లు బోర్డుకు జమ చేయాలని 60 సంవత్సరాలు నిండిన కార్మికులు విధులలో ఉన్నంతకాలం పరిహారం కొనసాగించాలని, 60 సంవత్సరాలు దాటి ఎప్పుడు చనిపోయిన పరిహారం ఇవ్వాలంటూ ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతి పత్రంలో కార్మికులు డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రమేష్ బాబు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, ఉపాధ్యక్షులు యండి కరిముల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, రామకష్ణ సిఐటియు అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మోపిదేవి మండల కార్యదర్శి సిహెచ్ రాజశేఖర్ నెరుసు, నాగేశ్వరరావు, చల్లపల్లి మండల అధ్యక్షులు వందల పార్టీ నరేంద్ర చల్లపల్లి మండల కార్యదర్శి తంబాల దానియేలు, కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ అవనిగడ్డ మండల నాయకులు కష్ణంరాజు కార్మికులు పాల్గొన్నారు



రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం కొత్తమాజేరు సమీపంలో జాతీయ రహదారి 216పై రోడ్డు ప్రమాదం శనివారం జరిగింది. సంఘటన సమాచారం అందుకున్న పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వారు అందించిన వివరాల ప్రకారం చల్లపల్లి నుండి మచిలీపట్నం వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పిచల్లపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి మురుగు బోదులోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఘంటసాల మండలం పూషడం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు పరబ్రహ్మం కుడి కాలు విరిగినట్లు చెప్పారు. బాధితుని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లక్ష్మణ రాజు తెలిపారు. అదే సమయంలో మచిలీపట్నం నుండి చల్లపల్లి వస్తున్న అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ప్రమాదం జరిగిన సంఘటనా స్థలంలో ఉన్న బాధితుడు పరబ్రహ్మం ను పరామర్శించి ఓదార్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



మణిపూర్లో దాడులు అరికట్టాలని ర్యాలీ

ప్రజాశక్తి-గుడివాడ : ఇటీవల మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై క్రైస్తవ సంస్థలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఆదివారం పట్టణ క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్కార్మెల్ మాత చర్చ్ వద్ద నుండి నెహ్రూ చౌక వరకు క్రైస్తవ విశ్వాసులు శాంతి ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్లో శాంతి నెలకొనాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దమనకాండను అరికట్టాలని, ప్రజాస్వామ్య భారతదేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు క్రైస్తవ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ



ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలం వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపారుపూడి స్టేషన్ ఎస్ఐ పి. నాగకళ్యాణి ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పెదపారుపూడి నాలుగు రోడ్ల కూడలిలో పోలీస్ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ప్రమాదాల నివారణపై ఎస్ఐ, సిబ్బంది సూచన చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావటంతో ఆటోలలో అధిక సంఖ్యలో కూలీలను తరలించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులకు సూచించారు. వాహనాలు నడిపే వ్యక్తులు లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలపై ఇద్దరుకు మించి ఉండరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పి.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా జగనన్న పాలన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాలలో సచివాలయం వ్యవస్థ స్థాపించి ప్రజల వద్దకే పాలనను అందిస్తున్నారని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. శనివారం మండలంలోని బండిపాలెం గ్రామంలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన వైయస్సార్ విలేజ్ క్లినిక్, జగనన్న పాలవెల్లువా, రైతు భరోసా కేంద్రం భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను, ఏపీఐడీసీ చైర్ పర్సన్ బండి పుణ్యశీల, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలకుల హయాంలో బండిపాలెం గ్రామం ఎటువంటి అభివద్ధికి నోచుకోలేదని, నేడు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో బండిపాలెం గ్రామంలో ఒకేచోట ఇన్ని అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మండల పార్టీ అధ్యక్షులు మండవ శ్రీనివాస్ గౌడ్, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు బహూకరణ



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ బ్రాంచ్ గ్రంథాలయానికి నాలుగో వార్డ్ కౌన్సిలర్ మారం అమరయ్య కుర్చీలు విరాళంగా అందజేశారు. నందిగామ వాసవి క్లబ్ సిల్వర్ స్టార్ అధ్యక్షులు పులిపాటి సంధ్యారాణి జాయింట్ సెక్రెటరీ పులిపాటి వెం కటేశ్వరరావు, ట్రెజరీ మారం వెంక టేశ్వరరావు కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ గ్రం థాలయ అధికారి షేక్ మస్తాన్వలి, కేతేపల్లి నీలేశ్వరావు, పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. నందిగామ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా. చిన్న, లయన్స్ క్లబ్ సభ్యులు కుంచం లక్ష్మీ నారాయణ, రామిరెడ్డి శ్రీ దర్, గోపు సుబ్రహ్మణ్యం, ఏచూరి రాము, శీత రామయ్య, చల్లా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



ప్రజాశక్తి- నందిగామ : రౌడీ షీటర్లు చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నందిగామ సిఐ హనీష్ హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణ కొరకు కమిషనర్ కాంతి రానా టాటా ఆదేశాల మేరకు ఏసిపి జనార్దన్ నాయుడు ఆధ్వర్యంలో సిఐ హనీష్ టౌన్ పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ హనీష్ రౌడీషీటర్లతో మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే విధముగా రౌడీ షీటర్లు ఏ విధమైన అవంతరాలు కలిగించరాదని చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పండు దొర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాపిడ్ అండ్ బ్లిడ్జ్ చదరంగం విజేతలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జూనియర్ చెస్ అకాడమీ, ది విజయవాడ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమ్మనా ఏ స్టేట్స్ విజయవాడలో ఆదివారం జరిగిన జిల్లా రాపిడ్ అండ్ బ్రిడ్జి చదరంగం పోటీల్లో జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా డాక్టర్ వై.రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు చదరంగంలో రష్యన్ ప్రభావం ఎక్కువగా ఉండేదన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్ చదరంగం విజేతలు తెలియచేశారు. కొల్లా భావన్ ప్రథమ, భావన పంచిమర్తి ద్వితీయ స్థానాన్ని సాధించారు. బ్రిడ్జి చదరంగం విభాగంలో పుచ్చలపల్లి హరీష్ సాయిరాం ప్రథమ, శశాంక్ ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ నలుగురు క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రాపిడ్ అండ్ బ్రిడ్జ్ చదరంగ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అండర్ 7,9 ,11 ,13, 15 విభాగాలలో వారికి ట్రోఫీలు మెడల్స్ సర్టిఫికెట్స్ అందచేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ బాషా, మందుల రాజీవ్ టోర్నమెంట్ అడ్వైజర్ డాక్టర్ బి చంద్రశేఖర్, ,డాక్టర్ పి శ్రీనివాసులు ఏ సురేష్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు టిడిపితోనే సాధ్యం



ప్రజాశక్తి - భవానీపురం : తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ఆదివారం 44వ డివిజన్‌లో 44వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ మాట్లాడుతు పేద ప్రజల ఆర్థికస్థితి మళ్ళీ గాడిన పడాలి, పేదరికం నిర్మూలన జరగాలి అంటే అది తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం దోపిడి రాజ్యంగా మారిందని, పేదవాడి రాజ్యం కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతు భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమానికి లభించిన ప్రజా స్పందన ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను ప్రజలకు అందించి, మొదటి విడత మేనిఫెస్టో పథకాల్ని వివరించాం అని వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ బడుగు గణేష్, 44వ డివిజన్ సెక్రెటరీ కె.సత్యనారాయణ సింగ్, డివిడి ప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఎ.రామారావు, బి.సాయి కుమార్ రెడ్డి, సరగడ నాగిరెడ్డి, జి.ఏడుకొండలు, జి.నాగరాజు, జి.గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ సంఘం అధ్యక్షుడిగా పసుపులేటి రవీంద్ర



ప్రజాశక్తి - తిరువూరు : శ్రీకనకదుర్గ మెకానికల్ తిరువూరు వర్కర్స్ యూనియన్ ఎన్నికలలో పసుపులేటి రవీం ద్ర గెలుపొందారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూనియన్ ఎన్నికలను సీనియర్ మెకానిక్ లు వెంకటేశ్వ రరావు, ఆనంద్ బాబు, సర్దార్ నిర్వహించారు. మొత్తం 81 ఓట్లకు గాను అధ్యక్షులు గా బరిలో ఉన్న రవీంద్ర కు 41, ఎస్ కె. సుభానికి 40 ఓట్లు వచ్చాయి. దీనితో రవీం ద్ర ఒక ఓటు మెజారిటీతో గెలుపొందారు. టూ వీలర్ బైక్ మెకానిక్ ల సంక్షేమానికి, ఆర్థి క అభివద్ధికి, ప్రతి ఒక్కరికీ ఉచిత భీమా వర్తింపచేసేలా కషి చేస్తానని రవీంద్ర తెలిపా రు. త్వరలో ప్రమాణస్వీకార ఏర్పా టు చేస్తానని తెలిపారు.

'మెయిన్‌రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి'



ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 43వ డివిజన్‌లోని ఊర్మిళ నగర్ ప్రధాన రోడ్డు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని జనసేన విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకటమహేష్ డిమాండ్ చేసారు. ఆదివారం ఆ రోడ్డును జనసైనికులతో కలసి పరిశీలించిన మహేష్ మాట్లాడుతు ఊర్మిళా నగర్ ప్రధాన రహదారిపై ఖచ్చితంగా ఏడాది క్రితం చెట్లు నాటి నిరసన తెలిపామని, నేటికీ రోడ్డు నిర్మాణం కాలేదని విమర్శించారు.యుద్ధ ప్రాతిపదికన మూడు నెలల్లో ఊర్మిళ నగర్ రోడ్డు పూర్తి చేయ రోడ్డు పూర్తి చేయకపోతే పెద్దయెత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ వైసిపి పార్టీకి అనధికార నగర అధ్యక్షులులాగా పనిచేస్తున్నారని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జనసేన 45వ డివిజన్ నాయకులు బొమ్ము రాంబాబు మాట్లాడుతూ తాము గత కార్పొరేషన్ ఎన్నికల్లో నిజాయితీగా పోటీచేసామని, ఆస్తులు అమ్ముకోవాల్సిన అగత్యంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన వివిధ డివిజన్‌ల అధ్యక్షులు జెల్లి రమేష్, తిరుపతి అనూష, కొరగంజి వెంకటరమణ, పొట్నూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ మంత్రి ఈశ్వర్




ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ తరగతుల అభివద్ధి, మైనారిటీ సంక్షేమం మరియు వద్ధ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చే శారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మకు ఆషాడ సారె సమర్పించిన పలు భక్త బృంద సభ్యులు

అమ్మవారికి ఆషాడ పవిత్ర సారె సమర్పించటానికి, అమ్మవారి దర్శనార్థం భక్తులు ఆదివారం విశేషంగా తరలివచ్చారు. భక్తుల రద్దీ దష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహనాధికారి దర్భముళ్ల భ్రమరాంబ అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య బందం, దేవిశెట్టి బాలకష్ణ బందం, ఆంధ్రప్రదేశ్ భవానీ దీక్షా వ్యవస్థపాక పీఠం (ఈది ఎల్లారావు బందం) 700 మంది, మొగలరాజపురం నుండి కళావతి బందం 50 మంది, పొన్నూరు నుండి ఎం అరుణ బందం 50 మంది మరియు ఇతర బందములు మొత్తం 1600 మంది పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించుటకు విచ్చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ , కార్యనిర్వాహనాధికారి వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కార్యనిర్వాహనాధికారి పి. గురుప్రసాద్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, దేవిశెట్టి బాలకష్ణ, కేసరి నాగమణి, బచ్చు మాధవకష్ణ పాల్గొన్నారు. అనంతరం మహామండపం ఆరవ అంతస్తులో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మకు బోనాలు



ప్రజాశక్తి- నందిగామ : మండలం లోని రామిరెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ముత్యాల అమ్మవారి గ్రామ బోనాలు ఘ నంగా నిర్వహించారు. గ్రామ మహిళలు మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ పుర వీధిలో ఊరేగింపుగా ఆలయంలోని అమ్మవారికి జల బిందెలతో వారు పోశారు. గ్రామాల్లో సకా లంలో వర్షాలు కురిసిపాడిపంటలతో తులతూ గాలని అమ్మవారినీ వేడుకుంటూ, పసుపు కుం కుమలు గాజులు పాల పొంగళ్ళు సమర్పించి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

31తో ముగియనున్న డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలు

ప్రజాశక్తి- నందిగామ : డా బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లో బి. ఎ, బి.కామ్, బి.ఎస్.సి డిగ్రీ కోర్స్ లలో ప్రవేశాలు పొందటానికి రెగ్యులర్, ఇంటర్మీడియేట్ ,ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ,రెండు సంవత్సరముల డిప్లొమా కోర్సులు పాస్ అయిన విద్యార్థులు అర్హులు అని, వారు జూలై 31లోపు దరఖాస్తు చేసుకోవాలని నందిగామ కె.వి.ఆర్ కళాశాల అభ్యాసకులు సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ఏలూరి పిచ్చేశ్వర రావు తెలిపారు. పూర్తి వివరములకు www. braouon-line.inకాని, ఆఫీసు నంబర్ 7382929685 ను సంప్రదించాలని కోరారు.

ఆషాడం సారె సమర్పణ

ప్రజాశక్తి-నందిగామ : జనసేన పార్టీ నందిగామ నియోజకవర్గం వీర మహిళా విభాగం ఆధ్వర్యంలో అంబారుపేట శ్రీ సత్యమ్మ తల్లి అమ్మవారికి ఆషాడం సారే, బోనాల సమర్పణ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జనసేన పార్టీ కార్యాలయం నుంచి కాలినడకన పురవీధులలో బోనాలు ఎత్తుకొని మహిళలు ఊరేగింపుగా బయలుదేరారు. ఉదయం 11 గంటల 30 నిమిషాలకు అంబారుపేట శ్రీ సత్యమ్మ అమ్మవారికి ఆషాడం సారే, బోనాలను మేళాలతో, కోలాటం బందాలతో పురవీధుల్లో కోలాటం ఆడుతూ ఆషాడం సారే సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకష్ణ, ఉపాధ్యక్షులు బొలియా శెట్టి శ్రీకాంత్ ,కష్ణ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

ప్రజాశక్తి వత్సవాయి

మండల కేంద్రమైన వత్సవాయిలో ఆదివారం మహామేరు శ్రీచక్ర వాసవి కన్యకా పరమేశ్వరి దేవి సహిత నవ ఉప ఆలయముల క్షేత్ర ప్రాంగణంలో అత్యంత వైభవోపేతంగా స్థానిక శివాలయం నుండి మహిళలు మంగళ వాయిద్యములు, కోలాట బందంతో శోభాయాత్రగా క్షేత్ర ప్రాంగణంలో వేంచేసి ఉన్నటువంటి అమ్మవార్లకు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆషాడసారే సమర్పణ నిర్వహించడం జరిగింది. 600 కేజీల కూరగాయలతో అత్యంత సుందరంగా అమ్మవార్లను శాకాంబరీ దేవతలుగా అలంకరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



18న ఆశా వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పి. ధనశ్రీ

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ఆశా వర్కర్స్‌కు పని భారం తగ్గించాలని, సెలవులు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన మచిలీపట్నం డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కృష్ణా జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి పి. ధనశ్రీ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ధనశ్రీ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా వర్కర్లపై పని భారాన్ని పెంచిందని, పది వేల వేతనం ఇస్తున్నామన్న పేరుతో 24 గంటలు చాకిరీ చేయిసున్నారన్నారు. సిబ్బంది చేయాల్సిన అనేక రకాల పనులను ఆశాలతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేయని సెల్ ఫోన్లు ఇచ్చి 2జి సిమ్ ఇచ్చి 14 రకాల యాప్లను డౌన్ లోడ్ చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉదయం ఈ ఆశ యాప్ లో లాగిన్ అవ్వాలని సాయంత్రం 6 గంటలకు లాగిన్ అవ్వాలని చెప్పడం ఎంతవరకు సబబు అన్నారు. గ్రామీణ ప్రాంతంలో నెట్వర్క్ లేకపోయినా ఫోన్లు పనిచేయకపోతే సొంత ఫోన్ కొనుక్కొని పని చేయాలని లేకుంటే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నరన్నారు. ఇది ప్రభుత్వం యొక్క దుర్మార్గం కి నిదర్శనం అని ఆవేదన వ్యక్తం చేశారు . ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ధర్నాని జయప్రదం చేయాలని ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కిరణ్మయి,భాను శ్రీ పాల్గొన్నారు.



పాఠశాలకు స్థలం వితరణ

ప్రజాశక్తి-కోడూరు : దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఉమ్మడి కష్ణాజిల్లా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్, కడవకొల్లు నరసింహారావు తన స్వగహమైన కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామంలో పాఠశాలకు స్థలం లేకపోవడంతో, ఆయన సొంత స్థలమైన 15 సెంట్ల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం అందజేస్తామని కోడూరులో గతంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో సభ ముఖంగా ప్రకటించారు. ఆయన ప్రకటించిన విధంగానే 12 లక్షల విలువైన 15 సెంట్లు స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం విద్యాశాఖ అధికారులకు అప్పచెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆ స్థలంలో మేరక పనులు చేపట్టడానికి స్థానిక ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కడవకొల్లు నరసింహారావు తన సొంత స్థలాన్ని పాఠశాల కోసం కేటాయించారని, మేరక పనులకు కూడా తన సొంత డబ్బును కేటాయిస్తున్నారని తెలిపారు. పాఠశాలకు సొంత స్థలం లేకపోవడంతో ఆయన సొంత స్థలాన్ని కేటాయించారని, ఈ సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అద్దంకి శివప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు పరిశె వెంకటేశ్వర్లు, జిల్లా రైతు విభాగం నాయకులు కొండవీటి వీర వెంకట నారాయణరావు, ఎంపీటీసీ సభ్యులు బడే హేమ గంగాధర్ రావు, కోడూరు మండల ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌జె డాన్స్ అకాడమీ ప్రారంభం



ప్రజాశక్తి-ఉయ్యూరు : పిల్లల భవిష్యత్తు కోసం చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని దేశభక్తి అభ్యుదయ జానపద పాటల్లో కూచిపూడి భరతనాట్యం డాన్సులలో శిక్షణ ఇచ్చేందుకు నాగళ్ళ రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డాన్స్ అకాడమీ ఏర్పాటు చేయడం శుభపరిణామమని కూచిపూడి నాట్యాచారిని శ్రీమతి గోనుగంట శైలజ శ్రీ అన్నారు. ఆదివారం ఆర్జె డాన్స్ అకాడమీ పేరుతో ఉయ్యూరు లోని విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో నేర్చుకుని సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని ఆమె అన్నారు. కళలలో భాగమైన సాహిత్యం తెలుగు భాషలో గొప్పతనం వ్యక్తిత్వ వికాసంలో భాగంగా ఉండాలని సరస భారతి అధ్యక్షులు గబ్బిట దుర్గాప్రసాద్ అన్నారు. కళారూపాలను ప్రోత్సహించడంలో తన వంతు కషి చేస్తానని కళాకారుడు నగర పంచాయితీ మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు అకాడమీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రంగస్థలం కళాకారుడు నాంచారయ్య కోరారు.. మారుతున్న కాలంలో మనిషికి మనిషికి మధ్య బంధాలు దూరమవుతున్న ఈరోజుల్లో పిల్లలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని మొబైల్ నెట్ ఫోన్లో బారి నుండి రక్షించుకునేందుకు పిల్లల భవిష్యత్తు కోసం అనేక అంశాల్లో నైపుణ్యాన్ని వెలికి తీసి రకరకాల కళారూపాల వైపు ప్రోత్సహించాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్కే కాసిం అన్నారు . ఆర్ జె డాన్స్ అకాడమీ పేరుతో ప్రారంభిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేశభక్తి అభ్యుదయ జానపద వెస్ట్రన్ పాటలకు డాన్సులు పాటల్లో శిక్షణ పర్సనాలిటీ డెవలప్మెంట్ పై నిపుణులతో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, ప్రతి ఆదివారం సాయంత్రం మూడు గంటలకు మహిళలకు పిల్లలకు ఉచితంగా కోలాట శిక్షణ ఇవ్వబడుతుందని ఆర్గనైజర్ కె కొండ బాబు తెలిపారు. అనంతరం వివిధ కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఆర్గనైజర్ బి కీర్తి, విజ్ఞాన కేంద్రం బాధ్యులు కే శివ నాగేంద్ర బి రాజేష్ ఎన్ గోపాల్, ఇస్మాయిల్, బాజీ బాబు తెల్లాకులా తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్ల సాధనకై చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు, మంగళాపురం పీఏసీఎస్ సీఈఓ చంద్ర రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం చల్లపల్లిలో ఆయన మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సహకార వ్యవసాయ సహకార సంఘాల ఐక్యవేదిక ఈ నెల 17న చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ లో జరిగే సహకార ఉద్యోగుల ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రవికుమార్ పిలుపునిచ్చారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉయ్యూరు : గండిగుంట దత్తాశ్రమంలో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజి, పంతజలి యోగ సమితి, సద్గురు శాంతి సుధ చారిటబుల్ ట్రస్టు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గండిగుంట, ఉయ్యూరు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి : జెసి



మాట్లాడుతున్న జెసి అపరాజితసింగ్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు మొక్కలను పెంచాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. సహాయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి స్వచ్ఛం దంగా ఏర్పాటుచేసిన ఉచిత 30 వేల మొక్కల పంపిణీ కార్యక్రమం ఆదివారం మచిలీపట్నంలోని జై హింద్ హైస్కూల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ మచిలీపట్నంలో ఉన్న ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలని అన్నారు. కరోనా పరిస్థితులలో ఆక్సిజన్ లేక సిలిండర్లతో కాలం గడిపిన రోజులు మర్చిపోకూడదన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి 15 లక్షలు రూపాయలు ఖరీదు చేసే 30 వేల మొక్కలను స్వచ్ఛంద సంస్థకు అందించడం పదిమందికి ఆదర్శప్రాయమని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ వడాలి వెంకట ఫణి రామ్ కుమార్ మాట్లాడుతూ మచిలీపట్నంలో మెగా ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం ఆదర్శప్రాయం అని అన్నారు. మొక్కలు నాటడం జనజీవన స్రవంతిలో ఒక భాగంగా అందరూ భావించాలని, ఆచరించాలని అన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి పి.సీతాపతి రావు మాట్లాడుతూ మచిలీపట్నాన్ని మరో మినీ బెంగళూరు వల్లే మార్చడానికి 30 వేల మొక్కల పంపిణీ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సహాయ ఫౌండేషన్ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గతంలో 20,000 మొక్కలను పెడన, మచిలీపట్నంలో పంపిణీ చేయడం జరిగిందని నేడు 30 వేల మొక్కలతో మచిలీపట్నాన్ని సుందర్ నగరంగా తీర్చిదిద్దడానికి సహాయ ఫౌండేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సహయ ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్ భాష, కార్పొరేటర్ అస్గర్, డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణ్ స్వామి, సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ప్రసాద్, జై హింద్ హైస్కూల్ హెచ్ ఎం ఎన్ వీ ఎస్ సూర్యనారాయణ, సహాయ పౌండేషన్ ప్రతినిధులు,స్టార్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీరామ్, చిలంకుర్తి శేషు, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు అబ్బాస్,సహాయ ఫౌండేషన్ మీడియా విభాగం చైర్మన్ కాగిత శంకర సాంబశివరావు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి ఖండన

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి గొరిపర్తి శ్రీనివాసరావుపై దుండగుల దాడిని సిపిఎం పార్టీ, అనుబంధ ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు మాట్లాడుతూ న్యాయవాదులు ఎప్పటినుండో కోరుతున్న రక్షణ చట్టాన్ని తీసుకురావడంలో తాత్సారం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. లాయర్ల సంరక్షణ కోసం ప్రభుత్వం వెంటనే న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తెచ్చి వారికి భరోసా కల్పించాలని సూచించారు. న్యాయవాది శ్రీనివాసరావుపై దాడిని నిరసిస్తూ సోమవారం మొవ్వ కోర్టులో మొవ్వ బార్ అసోషియేషన్ తలపెట్టిన విధుల బహిష్కరణకు సిపిఎం, అనుబంధ ప్రజాసంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. మద్దుల బసవయ్య, కాకి రాజశేఖర్, సంసోను ,కరీముల్లా,వాకా రామచంద్రరావు, యద్దనపూడి మధు ,చేబ్రోలు బసవపూర్ణమ్మ ,మురహరిరెడ్డి తదితరులు న్యాయవాది శ్రీనివాసరావుపై జరిగిన దాడిని ఖండించిన వారిలో ఉన్నారు.



బియ్యం అందిస్తున్న దృశ్యం

రైతుబజారులో ప్రత్యేక బియ్యం కౌంటర్

ప్రజాశక్తి-చల్లపల్లి : మార్కెట్లో ధరలు పెరిగిన నేపథ్యంలో రైతు బజారుల ద్వారా తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పుపంపిణీ చేసేందుకు రైతు బజార్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లై అధికారిణి వి పార్వతి తెలిపారు. శనివారం చల్లపల్లి రైతు బజారులో తక్కువ ధరకు బియ్యం విక్రయ స్టాల్ ప్రారంభించారు. పార్వతి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం పది కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చల్లపల్లి రైతు బజారు ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తి, దివి తాలూకా రైస్ మిలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గోగినేనిపాలెం విద్యార్థికి ట్రిపుల్ ఐటిలో సీటు



ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం గోగినేనిపాలెం ఎన్.జి.రంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెనుమత్స లోకేష్ వర్మ గత పదవ తరగతి ఫలితాలలో మంచి మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయ సిబ్బంది, తన తోటి విద్యార్థులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు లోకేష్ వర్మ కు శుభాకాంక్షలు చెప్పి, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు తమ అభినందనలు తెలియజేశారు. లోకేష్ వర్మ తల్లిదండ్రులు ఉపాధ్యాయులందరికీ తమ యొక్క హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేశారు.

తిరుపతమ్మకు బోనాలు సమర్పణ

ప్రజాశక్తి-గన్నవరం : అషాడమాసం సందర్భంగా కష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో మహిళలు శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్లకి బోనాలు సమర్పించారు. కుమ్మరకాలనీ లో కానూళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ మహిళలు బంధువులు, కానూళ్ల కుటుంబసభ్యులు కలిసి బోనాలు తలపై పెట్టుకుని ఉరేగింపుగా తరలివచ్చి తిరుపతమ్మ అమ్మవారికి సంప్రదాయబద్దంగా బోనాలు సమర్పించారు. కానూళ్ల శ్రీనివా సరావు, కష్ణవేణీ, రేవతి, లక్ష్మీ, ధనలక్ష్మీ, విజయలక్ష్మీ, బాడిత మాధవి, మౌనిక, హేమలత అంజనాదేవి కానూళ్ల, సుబ్బారావు , కానూళ్ల వెంకటేశ్వరరావు, కానూళ్ల ఏడుకొండలు, కానూళ్ల శ్రీనుబాబు విచారపు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు



'లయన్స్' ఆధ్వర్యంలో అన్నదానం

విజయవాడ: అన్నదానం వల్ల అనాథలు, పేదల ఆకలి తీరుతుందని జిల్లా లయన్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కేబినెట్ సెక్రెటరీ ఎ.శరాబందిరావు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ ఎదురుగా గల ఎస్‌కెసివి అనాథ విద్యార్థుల ఆశ్రమంలో సివిఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ టి.వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. జిల్లా లయన్స్ క్లబ్ విద్యా కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ ఎమ్.ఎస్.ఇమామ్‌బాషా మరొక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అన్ని దానాల్లా కంటే అన్నదానం అతి ముఖ్యమైనదన్నారు. క్లబ్ ట్రెజరర్ జి.నాగరాజు మాట్లాడుతూ క్లబ్ అన్నదాన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పి.వి.హనుమంతరావు, క్లబ్ డైరెక్టర్లు సిహెచ్.రూపనాథ్, పి.వెంకటరమణ, ఎం.శ్రీనివాసరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

దార్శనికుడు కంచి రామారావు

ప్రజాశక్తి-తిరువూరు: ఎంతో ముందు చూపుతో తిరువూరులో విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేసిన ఘనత కంచి రామారావుకు దక్కుతుందని పలువురు వక్తలు కొనియాడారు. రాజకీయంగా అంచలంచెలుగా ఎదుగుతూ మార్కెట్ ఛైర్మన్‌గా, ఇఫ్కో డైరెక్టర్‌గా పనిచేసి ఎంతోమందికి సేవలు అందించారని కంచి రామారావును కొనియాడారు. కంచి రామారావు 85వ జయంతి ఉత్సవాలు తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుశీలరావు అధ్యక్షత వహించారు. కాలేజీ అభివద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని కంచి కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా 1.10 లక్షల రూపాయల విలువైన 12 సీలింగ్ ఫ్యాన్లు, 15 ఇనుప ర్యాకులను కాలేజీకి బహూకరించారు. డిగ్రీ కాలేజీని అభివద్ధి చేయడానికి తమ కుటుంబం అన్ని రకాలుగా సహకరిస్తుందని బాబి ప్రకటించారు. కాలేజీలో ఉన్న పురాతన భవనాన్ని రీ మోడలింగ్ చేయడం, ఇతరత్రా కాలేజీకి కావాల్సిన అంశాలను దశలవారీగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మి, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అబూబకర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జి సాధనకు దశలవారీ ఉద్యమం

• రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం • బ్రిడ్జి నిర్మాణ సాధన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ: గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జీ సాధనకు దశలవారీ ఉద్యమం చేపట్టాలని బ్రిడ్జీ సాధన కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. 14 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని సమావేశం డిమాండ్ చేసింది. పాదయాత్రలు, ఇంటింటికి సంతకాల సేకరణ, వినతిపత్రాల సమర్పించడం, మహా ధర్నా, 24 గంటల నిరాహార దీక్షతో సహా దశలవారీగా ఉద్యమం చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది.స్థానిక గుణదలలో స్థానిక పెద్దలు, కాలనీలు, అసోసియేషన్ బాధ్యులు, వివిధ సంఘాల నేతలతో గోవింద్ అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ...గుణదల ఫ్లైఓవర్ బ్రిడ్జీ నిర్మాణానికి పోరాటమే మార్గమని, రాజకీయాలకతీతంగా ప్రజలందరూ కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధి, ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జీ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయిందని విమర్శించారు. ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు, తగిన కార్యక్రమాలు చేపట్టేందుకు బిడ్జి సాధన కమిటీ ఏర్పడిందని అన్నారు. 14 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన బ్రిడ్జికి నేటికీ అతీగతీ లేకపోవడం శోచనీయమన్నారు.మూడు ప్రభుత్వాలు,



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ఐదుగురు ముఖ్యమంత్రులు మారినా బ్రిడ్జి పనులలో పురోగతి లేదని విమర్శించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్రిడ్జి నిర్మాణం పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయని, పన్నులు పెంచటమే తప్ప, అభివద్ధి పనులపై పాలకులకు దష్టి లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రిడ్జికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి,మాట తప్పటం బాధాకరమన్నారు. మల్లాది విష్ణు రెండుసార్లు ఎమ్మెల్యేగా, 9 సంవత్సరాలుగా బాధ్యతల్లో ఉన్నా, బ్రిడ్జి నిర్మాణ పనులు వీసమెత్తు ముందుకు సాగలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందన్నారు. స్థానిక ప్రజలు బ్రిడ్జి లేక నరకయాతన పడుతున్నారు, గుణదల ప్రాంత అభివద్ధి నిలిచిపోయిందన్నారు. బ్రిడ్జి లేక రైల్వే ట్రాక్ పై ట్రాఫిక్ నిలిచిపోయి ప్రమాదాలు పొంచి ఉన్నాయన్నారు.ఈ ప్రాంత భూములు, ఆస్తులు విలువలు పడిపోతున్నాయని, గహ నిర్మాణాలు ముందుకు సాగటం లేదని అన్నారు. గుణదల మాత్రమే కాకుండా నగరం, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది ప్రజలకు అవసరమైన ఈ బ్రిడ్జి ఎడల పాలకులు శీతకన్ను వేయటం దురదష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు కళ్ళు తెరవాలి, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి సాధనకు పార్టీలకతీతంగా ప్రజలందరూ ఉద్యమించాలన్నారు.ఈ సమావేశంలో ఐద్వా నాయకులు ఎస్ షకీలా, స్థానిక పెద్దలు అజయ్, కష్ణయ్య, వెంకట్, సురేష్, ప్రసన్న, ఆదిబాబు,భాషా, రెడ్డి, సాగర్, రావు, ఎన్ వెంకటేశ్వరరావు, బలరాం, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు మెరుగైన పే స్కేల్ ఇవ్వాలి : పెద్దన్న

ప్రజాశక్తి-విజయవాడ

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ)కు మెరుగైన పే స్కేలు ఇవ్వాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.పెద్దన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశం విజయవాడ రాణిగారితోటలోని సిఐటియు కార్యాలయంలో బొడ్డు వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పెద్దన్న మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రస్తుతం నామినీలుగా పనిచేస్తున్న విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని, ఇప్పటికే చనిపోయిన విఆర్‌ఎల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని విఆర్‌ఎగా తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20, 21 తేదీల్లో మండల కేంద్రాల్లో, ఆగస్టు 7, 8 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద రిలే దీక్షలు చేపడతామని తెలిపారు. ఆగస్టు 25న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని



కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, విఆర్‌ఎల సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎన్.సిహెచ్.శ్రీనివాస్, కన్వీనర్‌గా కె.శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా బసవయ్య, కమిటీ సభ్యులుగా లక్ష్మణ, నాగభూషణం, కె.బాబు, ఎన్.ఆదిలక్ష్మి, నవీన్, వెంకటేశ్వరరావు, షేక్ ఖాసిం, రాంబాబు, భాస్కర్, ఎ.రాంబాబులను ఎన్నుకున్నారు.

గుణదల ఫ్లైఓవర్ నిర్మాణంపై నిర్లక్ష్యం

- **రూ.36 కోట్ల వ్యయంతో 2009లో పనులు ప్రారంభం**
- **ప్రస్తుతం రూ.75 కోట్లు ఖర్చవుతుందని అంచనా**

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి: గుణదల ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. నిర్మాణ పనులు పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తీసుకొని రావడంలో నిర్లక్షంగా వ్యవహరిస్తున్నాయి. దాదాపు దశాబ్ద కాలం క్రితం బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలు పెట్టినా నేటికీ పూర్తి చేయలేదంటే ఈ నిర్మాణంపై ప్రభుత్వాలకు ఏమేరకు చిత్త శుద్ధి ఉందో అర్థమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు వైసిపి టిడిపిలు దీనిని రాజకీయ అజెండాగా మార్చుకొని ఓట్లు దండుకుంటున్నాయని పలువురు ఆక్షేపిస్తున్నారు. అంతేకాకుండా దీని కంటే పెద్దవైన కనకదుర్గ ఫ్లైఓవర్‌లతో పాటు బెంజి సర్కిల్ రెండు ఫ్లైఓవర్‌లను గుణదల ఫ్లైఓవర్ కంటే ఆలస్యంగా మొదలు పెట్టినా వాటిని అందుబాటులోకి తెచ్చారు. కనక దుర్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 22నవంబరు 2015లో ప్రారంభించి 30 సెప్టెంబరు 2020న ఓపెన్ చేశారు. అదేవిధంగా బెంజి సర్కిల్ మొదటి ఫ్లైఓవర్‌ను 2020లోను, రెండో ఫ్లైఓవర్‌ను 2022లోను అందుబాటులోకి తెచ్చారు. కానీ వీటి కంటే సుమారు 14 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం మాత్రం ప్రభుత్వాల నిర్లక్షం వల్ల నేటికీ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ఇంత వరకు పూర్తి చేయలేదు. ఏలూరు వైపు 27 సెంట్లు, నున్న వైపు మరో 32 సెంట్లను సేకరించాల్సి ఉన్నా కార్యాచరణ చేపట్టలేదని విమర్శలు ఉన్నాయి. దీంతో పాటుగా ప్రభుత్వ స్థలాల్లో కట్టిన 107 ఇళ్లను తొలగించి, బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. కానీ ఈ పనులు కూడా నేటికీ కొలిక్కి రాలేదు. గుణదల బ్రిడ్జి చరిత్రను ఒక సారి పరిశీలిస్తే దాదాపు 15 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో దీని ప్రస్తావన తెరపైకి వచ్చింది. గుణదల నుంచి నున్న వరకు సుమారు 1.2కిమీ పొడవున వంతెనను నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా 9 పిల్లర్లు నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఈ ప్రాజెక్టుకు 2009లో నాటి ప్రభుత్వం దీనికి శంకుస్థాపన చేసింది. రూ. 36 కోట్ల అంచనా వ్యవయంతో దీని పనులు ప్రారంభించారు. 2015 జనవరి 24 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. నాడు చేపట్టిన టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ బిడ్‌ను దిక్కించుకుంది. అనంతరం రూ. 5.49 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. అందులో భాగంగా 4 పిల్లర్లు, హేమర్ హెడ్ బ్లాక్ పనులు కూడా పూర్తి చేశారు. అంతేకాకుండా మరో రూ. 1.70 కోట్లతో సివిల్ వర్కులు, రూ. 80లక్షలతో యుటిలిటీ షిఫ్టింగ్ పనులు, రూ. 2.01 కోట్లతో భూ సేకరణ కూడా చేపట్టారు. వీటితో పాటు మరో రూ. 98లక్షలను మొబలైజేషన్ అడ్వాన్స్ కింద చెల్లింపులు చేశారు. టిడిపి, నాటి కాంగ్రెస్ నేతల కారణంగా పనలు నిలచిపోయాయి. విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం కూడా దీని ప్రాముఖ్యతను గుర్తించ లేదు. వీరి నిర్లక్షం వల్ల ఈ ప్రాజెక్టు వ్యయం భారీ ఎత్తున పెరిగే అవకాశం ఉంది. సుమారు రూ. 70 కోట్ల నుంచి రూ. 75 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంటే నాటితో పోల్చిలే అదనంగా రూ. 34 కోట్ల నుంచి రూ. 40 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. టిడిపి, వైసిపిల నిర్లక్షమే దీనికి కారణమని అధికారులు సైతం పెదవి విరుస్తున్నారు.

నీరు-మట్టి పేరుతో దోచుకున్న టిడిపి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండలి బుద్ధప్రసాద్ గాంధేయ వాది అని, అహింస వాది అని టిడిపి నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు కితాబు ఇస్తున్నారని, బుద్ధ ప్రసాద్ గాంధీ వాది రూపంలో ఉన్న గాడ్స్ అనే విషయాన్ని మర్చిపోవద్దు అంటూ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తీవ్రంగా విమర్శించారు. శనివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుపై భరోసా బస్సు యాత్ర కార్యక్రమం అవనిగడ్డ నియోజక వర్గంలో ప్రవేశించిన సందర్భంగా ఉమామహేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పై పలు విమర్శలు చేశారు. దీనికి ఎమ్మెల్యే రమేష్ బాబు స్పందిస్తూ ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ కోసం సొంత వదిన ను హత్య చేసి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి దేవినేని ఉమామహేశ్వరరావు అని విమర్శించారు. దివిసీమలో హత్యలు చేసి హత్య రాజకీయాలు నిర్వహిస్తున్న వారంతా బుద్ధప్రసాద్ చుట్టూనే ఉన్నారనే విషయాన్ని ఉమా మహేశ్వరరావు గుర్తుంచుకోవాలన్నారు. ఉమా వాళ్లనే జిల్లాలో కుల రాజకీయాలు ఊపొందుకు న్నాయని, టిడిపిని భ్రష్టు పట్టించిన వ్యక్తి ఉమామహేశ్వరరావు అనే సంగతి ఆ పార్టీ వారి అందరికి తెలుసునన్నారు. తమపై ఎన్ని ఆరోపణలు చేసినా నమ్మేస్థితిలో మా నియోజకవర్గ ప్రజలు లేరని తెలియజేశారు. నియోజకవర్గంలో నీరు-మట్టి పేరుతో ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన దోపిడీ ప్రజలు ఎవరూ మర్చిపోలేదన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఇసుకను దోపిడీ చేస్తున్నానంటూ ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులకు సవాలు విసురుతున్నానని తన అవినీతిని ఎక్కడైనా నిరూపించాలని తెలిపారు. డెల్టా ఆధునికరణ పేరుతో చేయాల్సిన పనులు చేయకుండా వంతెనలు నిర్మించి కాంట్రాక్టర్ల కోసం పనులు చేపట్టి కాంట్రాక్టర్ సహాయంతో ఇల్లు కట్టుకున్న విషయాన్ని బుద్ధ ప్రసాద్ మరిచిపోరాదన్నారు. మట్టి ఇసుక సమస్తము దోపిడీ చేసిన వారు తమని విమర్శించడం విడ్డూరంగా ఉందని రమేష్ బాబు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఆనగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, కృష్ణా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గుర్రం బసవయ్య, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పథ్వీ రాజు, లంకమ్మ గుడి చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు



వడ్డెర ఫెడరేషన్‌కు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుడివాడ : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘానికి కేటాయించాల్సిన రూ 1500 కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. గుడివాడలోని వీరపనేని మురళీధర్ హాల్లో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం పట్టణ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంజి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరలు 40 లక్షల మంది వత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసిందని, కానీ జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులను కేటాయించలేక పోయిందన్నారు. వడ్డెర ఫెడరేషన్‌కు రూ.1500 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.1 కోటి మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో వడ్డెర వత్తిదారుల మహిళలపై, చిన్నారులపై, అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టడానికి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ లాగానే వడ్డెరలకు, వడ్డెర వత్తిదారులకు ప్రత్యేక అట్రాసిటీ తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వడ్డెర వత్తిదారుల సంఘం పట్టణ కార్యదర్శి చంద్రగిరి శివనాగ మల్లేశ్వరరావు, పట్టణ గౌరవాధ్యక్షులు తమ్మిశెట్టి లక్ష్మణరావు, పట్టణ అధ్యక్షులు ఉపతల ఏడుకొండలు, కోశాధికారి చల్లా చిన్నారావు, పట్టణ కమిటీ సభ్యురాలు తమ్మిశెట్టి నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ : గురువుగా బాధ్యతలు చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జూబ్లీయాన్ గురువులు ఫాదర్ మందపాటి లూయిస్‌రాజు, దాసి సురేష్, బొడ్డు ఆనందబాబులను కార్మేలమాత పండగ రోజు సత్కరించు కోవడం గొప్ప విషయమని మౌంట్ కార్మేలమాత (ఆర్‌సియం)దేవాలయం విచారణ గురువు గుజ్జుల మైఖేల్ అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్‌సియం చర్చిలో కార్మేల్‌మాత పండుగ సందర్భంగా జూబ్లియాన్ గురువులు ప్రత్యేక పూజాబలిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియంజోషి, సహాయ గురువు ఫాదర్ డి.జాన్‌హారిస్, కౌన్సిల్ సభ్యులు ఇంటి స్వామిదాసు, కారే శ్రీనివాసరావు, జీవరత్నం పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-సింగ్‌నగర్ : ఫొటోషూట్‌కి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్న ఇద్దరు స్టూడెంట్‌లను టిప్పర్ ఢీకొనడంతో వారిరువురు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పాతపాడు కండ్రిక వద్ద ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం పైపులరోడ్డు శాంతినగర్‌కు చెందిన కొత్తపల్లి జీడిద్య(16), అదే ప్రాంతానికి చెందిన గుంజపు వినోద్ (16)లు భవిష్య కాలేజీ లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. ఫొటో షూట్ కోసం ఇద్దరు కలసి ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తుండగా పాతపాడు కండ్రిక మలుపు వద్దకు వచ్చేసరికి వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. జీడిద్య తండ్రి కొత్తపల్లి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నున్న పోలీసులు తెలిపారు.



ఒరిగిన స్తంభాలను సరిచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : ఉంగుటూరు మండలం ఎలుకపాడు గ్రామంలో గద్దె రామ్మోహన్ రావు చాపల చెరువు వైపుకు వెళ్లే 24 గంటల కరెంటు సప్లై స్తంభాలు ఒరిగి పడిపోయే స్థితిలో ఉన్నాయని వాటిని వెంటనే పైకి లేపించాలని సిపిఎం గూడూరు మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకే పోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. గాలివానకి పడిపోయి తీగలు తెగితే అటువైపు పొలాల్లోకి వెళ్లేటువంటి వాళ్లకి మరియు గేదలకి రైతులకి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మరమ్మత్తు చేయని పక్షంలో రైతులను గ్రామస్తులను కలుపుకొని ఆందోళన చేయాల్సిన అవసరం వస్తుందని చెప్పి హెచ్చరించారు.

గొగినేనిపాలెం హైస్కూల్ హెచ్‌ఎంగా వేణు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం గొగినేనిపాలెం ఎన్.జి.రంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులుగా తమ్మన వేణుగోపాలరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ప్రభాకర్ బాబు కలిదిండి మండల ఎంఈఓ-2గా బదిలీపై వెళ్లారు. కొత్తగా ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన వేణుగోపాలరావు గతంలో పమిడిముక్కల మండలం అగినపర్రు జిల్లాపరిషత్ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు ప్రధానోపాధ్యాయులుగా చేరారు.

జనం కోసం జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన అవనిగడ్డ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనం కోసం జనసేన కార్యక్రమం పంచాయతీ పరిధిలోని రెండో వార్డ్ సుగాలి కాలనీలో నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చెన్నగిరి సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొచ్చు శ్రీహరి, పార్టీ నాయకులు అన్నపురెడ్డి ఏసు, మతి సుబ్రమణ్యం, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లాపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : సొంత లాభం కొంత మానుకొని సమాజ సేవకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న రమేష్ పాల్ సేవలు కొనసాగాలని ఎంపీపీ అనగాని రవి ఆకాంక్షించారు. గన్నవరం మండలం అల్లాపురం గ్రామం లో క్రౌన్ గ్రాస్పల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ మెగా మెడికల్ క్యాంపును ఆదివారం ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్రౌన్ గ్రాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎ. రమేష్ పాల్ అధ్యక్షత వహించారు. అనగాని మాట్లాడుతూ...ప్రతి మనిషి జీవితంలో సంపాదించిన దాంట్లో కొంత పేదల కోసం ఖర్చు పెట్టాలన్నారు. గ్రామంలో దాతల సహకారం తో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. గ్రామంలో మంచి కార్యక్రమం చేసిన రమేష్ పాల్ ని అభినందించారు. వైద్య శిబిరంలో అల్లాపురం, దావాజీగూడెం గ్రామాలకు చెందిన 1200 మంది రోగులు సేవలు పొందారు. రెండు లక్షల రూపాయల విలువైన మందులను రోగులకు పంపిణీ చేశామని రమేష్ పాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని,గ్రామ సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్న బాబు, పంచాయతీ కార్యదర్శి ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ అవుటపల్లి శివప్రసాద్, క్రిస్టియన్ సెల్ చైర్మన్ విల్సన్, క్రిస్టియన్, మైనారిటీ సంస్థ చైర్మన్ జాన్ వెస్లీ, క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి : తమ ప్రతిభతో ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ ఇమేజ్ ను కొనసాగిస్తున్న నిరుపేద విద్యార్థులు నేటి విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకులని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు చల్లపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్ నందు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో లక్షలాదిగా ఫీజులు చెల్లించి కూడా సాధించలేని అద్భుతమైన ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలో చదివి సాధించిన గ్రామీణ ఆణిముత్యాలు ప్రభుత్వ పాఠశాలలకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్ లు అని కొనియాడారు. ఘంటసాల మండలం మరియు చల్లపల్లి మండలాలకు చెందిన పదవ తరగతి టాపర్ లు షేక్ జాస్మిన్, తెనాలి జెస్సికా లు నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకులని అన్నారు. విద్యార్థులందరూ చిన్నప్పటినుండి స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని సరైన ప్రణాళికలతో విద్యను అభ్యసించాలని తెలిపారు. తమ ప్రతిభతో చదువుతున్న విద్యాసంస్థలలో సెలబ్రిటీలుగా గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. తొలుత ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించిన సందర్భంగా విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు వేణుగోపాలరావు, మండల అధ్యక్షులు మద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం : కొల్లు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్ర రాష్ట్రాన్ని అభివద్ధిని చేసి, ప్రతి ఒక్క పేదవాడు, ధనికులుగా తయారు చేయడమే చంద్రబాబు లక్ష్యం అని మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వర రావు,కొల్లు రవీంద్ర, నెట్టెం రఘురాం లు స్పష్టం చేశారు.కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథం బస్సు యాత్రలో ఆదివారం మచిలీపట్నం నియోజక వర్గంలో నిర్వహించారు. అనంతరం కోనేరు సెంటర్ నిర్వహించిన సభలో దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బందరు పోర్టు నిర్మాణంలో ముఖ్యమంత్రి జగన్ వెయ్యి కోట్లు అవినీతి కి పాల్పడ్డారని ఆరోపించారు. బందరు నియోజక వర్గంలో పేర్ని నాని చేసిన అవినీతి వింటుంటే విశ్వన మేము ఓట్లు వేసి గెలిపించింది అని ప్రజలు సిగ్గు పడుతున్నారని విమర్శించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నాని మయ మాటలు చెప్పే మాయగాడు, మోసగాడు ,అవినీతి డబ్బుతో మరో సారి ప్రజలను మోసం చేయడానికి రెడీ అవుతున్నాడు అని విమర్శించారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ సంపద సృష్టించి సంక్షేమం ఇచ్చే వ్యక్తి చంద్రబాబు నాయుడు ఒక్కడే నన్నారు. ఎంఎల్‌సి పంచుమర్తి అనురాధ, మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఉప సభ పతి బూరగడ్డ వేదవ్యాస్, పెడన,పామర్రు ఇంఛార్జి లు కాగిత కృష్ణ ప్రసాద్,వర్ల కుమార్ రాజా, మరియు కొనకళ్ళ జగన్నాథరావు , మాట్లాడిన ఈ సభలో పార్టీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

బెస్ట్ హెల్త్‌కేర్ బ్రాండ్‌గా అమృతాంజన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న అమృతాం జన్ హెల్త్ కేర్ సంస్థకు బెస్ట్ హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపు లభించిందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శంభు ప్రసాద్ అన్నారు. నగరంలోని ఓ హెూటల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఎకనామిక్స్ టైమ్స్ సంస్థ బెస్ట్ హెల్త్ కేర్ బ్రాండ్‌గా తమ సంస్థకు గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. దాదాపుగా వెయ్యికిపైగా బ్రాండ్‌లను పరిశీలించడంతో పాటు కఠినమైన ఎంపిక ప్రక్రియ తరువాత అమృతాంజన్ హెల్త్‌కేర్‌ను ఎంపికచేసినట్లు తెలిపారు. తమ సంస్థకు లభించిన గుర్తింపు వల్ల రానున్న కాలంలో ఇంకా మెరుగైన ఉత్పత్తులను మార్కెట్‌కు తెలియ చేయనున్నట్లు తెలిపారు.



పిల్లలకు ఉన్నత విలువలు నేర్పాలి

ప్రజాశక్తి - విజయవాడ : చిన్న వయస్సు నుంచే పిల్లలకు చదువులతో పాటుగా మంచి విలువలు నేర్పాలని అమరావతి బాలో త్సవం గౌరవా ధ్యక్షులు చలవాది మల్లికా ర్జునరావు అన్నారు. ఈ రోజు యనమలకుదురు 1వ వార్డులోని షేక్ రంగా వలి భవన్‌లో విశ్వ మానవ సంక్షేమ సంఘం, అమరావతి బాలో త్సవం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలోత్సవం ఆధ్వర్యంలో కరోనాకు ముందు నగరంలో 28 ట్యూషన్ కేంద్రాలు నిర్వహించామన్నారు. ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించిన విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పి.మస్తాన్‌రావు మాట్లాడుతూ చదువు ఏ ఒక్కరి సొత్తో కాదని కష్టపడితే అది అందరికీ దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం కార్యదర్శులు పిన్నమనేని మురళీకష్ణ, యువి రామరాజు, యనమలకుదురు మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె ఖాసిం, ట్యూషన్ టీచర్ శ్రీహర్షిణి, ట్యూషన్ బాధ్యులు ఎస్‌కే జాన్‌బి, స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బొల్లా వెంకటేశ్వరరావు, బాలోత్సవం ట్యూషన్స్ బాధ్యులు పి ఐజాక్ న్యూటన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మహిళా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - భవానీపురం : మహిళా సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యమని తెలుగుదేశం పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ అన్నారు. ఆదివారం పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో మహిళలను చైతన్య పరచటానికి రూపొందించిన మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బేగ్ మాట్లాడుతు వైసీపీ పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపి, అన్నివర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసానివ్వటం తెలుగుదేశంతోనే సాధ్యమ న్నారు. పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు సుకాసి సరిత మాట్లాడుతూ మహాశక్తి ద్వారా మహిళలకు పలు సంక్షేమపథకాలను తమ నాయకుడు చంద్రబాబు ప్రకటించారని వివరించారు. మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నసీమా మాట్లాడుతూ తెలుగుదేశం మహిళా సంక్షేమ ప్రభుత్వం అని, రాబోయే ఎన్నికల్లో మహిళా లోకం తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలుస్తార ని అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజ కవర్గం మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన 'కళాయజ్ఞ-జీవన రేఖలు' చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కళనీ,కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నగరానికి చెందిన లిఫోరం ఫర్ ఆర్టిస్ట్సలి ఆధ్వర్యంలో కళాయజ్ఞ– జీవన రేఖలు, ఏకవర్ణ చిత్రకళా ప్రదర్శన ఆదివారం నగరంలోని బాలోత్సవ్ భవన్ నందు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ జీవన రేఖలు చిత్రకళా ప్రదర్శనను ఎపి ఎం. ఇఎంఇ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు లాంఛనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా చిత్రకారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రముఖ చిత్రకారులు శేష బ్రహ్మం మాట్లాడుతూ చిత్రకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తే వారు ఆర్థికంగా ఎదగటానికి ఎంతో దోహదం పడుతుందని అన్నారు. అనంతరం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సభ్యులు పిన్నమనేని మురళీ కష్ణ, పోలవరపు సాంస్కృతిక సమితి నాయకులు గోళ్ళ నారాయణరావు, ప్రముఖ కార్టూనిస్ట్ టి.వెంకట్రావులు సభనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేటి తరం చిన్నారులు , యువ చిత్రకారులకు నీటివర్ణ చిత్రాలు గీయటంపై అవగాహన కల్పించేందుకు ఏలూరు కి చెందిన ప్రముఖ చిత్రకారుడు



మధుసూదనరావు తో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైవ్ డిమాన్ట్రేషన్ కార్యక్రమం కనుల పండుగగా జరిగి ఆహూతులను అలరించింది. అనంతరం జరిగిన బహుమతీ ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ కళాయజ్ఞ – జీవన రేఖలు చిత్రకళా ప్రదర్శన లో పాల్గొన్న కళాకారులకి అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. "ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్" సంస్థ తరుపున సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, కళాసాగర్, స్ఫూర్తి శ్రీనివాస్, రమేష్, స్వాతి పూర్ణిమ, సుధారాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించగా భారీ సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు, యువ చిత్రకారులు పాల్గొన్నారు.

సాహిత్య సామాజిక ఉద్యమకారుడు కలిమిశ్రీ

కుసుమ ధర్మన్న సాహిత్యసేవాపురస్కారం అందుకున్న శుభవేళ ప్రముఖుల ప్రశంసలు

ప్రజాశక్తి - విజయవాడ : గతేడాది జాతీయసాంస్కృతిక సంబరాలు నిర్వహించి నవ మల్లెతీగలా విజయవాడను అల్లుకున్న సాహిత్యపరిమళాలు ఎల్లడలా తెలుగుప్రజల హృదయాలను తాకి.. కనకదుర్గమ్మ తల్లి సంకల్ప బలంతో నేడు దళిత ఉద్యమ వైతాళికుడు కుసుమ ధర్మన్న పేరిట తొట్టతొలి సాహిత్యసేవా పురస్కారాన్ని కలిమిశ్రీ అందుకుని ఆయన అందరికీ చెలిమిశ్రీగా నిలిచారని సాహితీ ప్రముఖులు పలువురు అభినందనల ప్రశంసలజల్లు కురిపించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం విజయవాడ బందరురోడ్డులో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కుసుమ ధర్మన్న సాహిత్యసేవాపురస్కార ప్రదానోత్సవ సభ ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. వ్యాఖ్యాన కళాశిరోమణి వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించిన ఈ సభలో సుప్రసిద్ధ సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కష్ణ, నవభారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు సూరేపల్లి రవికుమార్, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకులు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్, కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్మన్ డాక్టర్ రాధా కుసుమ, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, బుద్ధభూమి ఎడిటర్ బొర్రా



గోవర్ధన్, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ ఘంటా విజయ్ కుమార్, కవి డాక్టర్ సి.నారాయణస్వామిలతోపాటు పలువురు కవులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు. సుప్రసిద్ధ సైకియాట్రిస్టు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, కుసుమ ధర్మన్న కళాపీఠం చైర్మన్ డాక్టర్ రాధా కుసుమ మాట్లాడుతూ మరుగున పడిపోతున్న గొప్ప సాహితీవేత్తలను ఈ తరానికి పరిచయం చేయాలనే సంకల్పంతో అటువంటి గొప్ప వ్యక్తి కుసుమ ధర్మన్న పేరిట కళాపీఠం స్థాపించినట్లు చెప్పారు. డాక్టర్ వడ్డేపల్లి కష్ణ మాట్లాడుతూ కుసుమ ధర్మన్న తన కవితాప్రస్థానాన్ని, సామాజిక సేవాప్రస్థానాన్ని కొనసాగించారని పేర్కొన్నారు.

పిల్లల్లో పుస్తక పఠనాన్ని పెంచాలి : వాడ్రేవు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విద్యార్థి దశ నుండి పిల్లల్లో చైతన్యం, సమాజం పట్ల అవగాహన కల్గించడంలో పుస్తక పఠనం గ్రంథాలయాలకు వెళ్ళడంలో ఉపాధ్యాయుల కంటే ప్రధానంగా తల్లిదండ్రుల బాధ్యత ఎంతైనా ఉందని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ విశ్రాంత సంచాలకులు వాడ్రేవు చిన వీరభద్రుడు ఉద్ఘాటించారు. ఏపి గ్రంథాలయ సంఘం అధ్వర్యంలో మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ ఆదివారం నాడు స్థానిక బెంజీసర్కిల్ సమీపంలో ఉన్న సర్వోత్తమ గ్రంథాలయం నందు నిర్వహించారు. ప్రారంభసభలో వీరభద్రుడు మాట్లాడుతూ ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించింది గ్రంథాలయ ఉద్యమమేనని, నేటి ఆధునిక సమాజంలో సంప్రదాయక పద్దతిలో ఉద్యమం నడపడం సాధ్యం కాదని అన్నారు. ఏపి గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ ఆంధ్రదేశంలో గ్రంథాలయ ఉద్యమ స్వరూపంతో పాటు గ్రంథాలయ సంఘం ఆవిర్భావ నేపథ్యం, పౌరులలో గ్రంథ ఆవశ్యకత వివరించారు. మంచికంటి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన



జరిగిన సభలో గ్రామ స్థాయిలో గ్రంథాలయాల ఏర్పాటు డిజిటలైజేషన్ వల్ల ఉపయోగాలు నష్టాలు వివరించారు. కార్యక్రమంలో భాగంగా మంచి కంటి జరిపిన మరో గ్రంథాలయ ఉద్యమ నిర్మాణం మోటార్ సైకిల్ యాత్ర దర్శనం పుస్తక ఆవిష్కరణ చేశారు. సభలో చావలి సుధాకర్ (ఓ పి డి ఆర్), కాసుల రవి కుమార్ (ఆంగ్ల అధ్యాపకులు వరంగల్), కొసరాజు సురేష్ (మంచి పుస్తకం), కష్ణ (అభ్యాస విద్యాలయం), అరసవిల్లి కష్ణ (విరసం) చలపాక ప్రకాష్ (రచయిత), డివికుమార్ (జనసాహితి), నారాయణం వేణు (ఏ పి టి ఎఫ్) మాల్యాద్రి (ప్రజా సైన్స్ వేదిక), జీ ఎస్ చలం (రచయిత), విశ్వేశ్వరరావు (శ్రీ శ్రీ ప్రింటర్స్), రెడ్డి రమణ(విజయనగరం) తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎన్ఎస్ఎం' గోల్డెన్ రన్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ స్వర్ణోత్సవాలలో భాగంగా పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గోల్డెన్ రన్ ఉత్సాహభరితంగా జరిగింది. ఈరన్‌ను నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సబ్ కలెక్టర్ అతిధి సింగ్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ చక్కటి విద్యను అందిస్తూ ఎంతో మందిని ఉన్నత వంతులుగా తీర్చిదిద్దిందని అన్నారు. ఒక విద్యా సంస్థ 50 సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్‌రాయప్పరెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థ 1974లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈసంద ర్భంగా



గోల్డెన్ జూబ్లీ లోగోను సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. రానున్న ఆరు నెలల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్ ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



'విమర్శలు మానుకోకపోతే బుద్ధి చెబుతాం'

ప్రజాశక్తి - భవానీపురం : వాలంటరీ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను తన గుప్పిట్లో పెట్టుకో వాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తు న్నారని, వాలంటరీ వ్యవస్థ గురించి మా నాయకుడు పవన్ కళ్యాణ్ మాట్లాడింది అక్షరసత్యమని, నిజాలు చెప్పినందుకు పవన్ కళ్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న కొంతమంది వైసిపి మంత్రులు, నాయకులు, జోగి రమేష్, అంబటి రాంబాబు, వెలంపల్లి శీను, గుడివాడ అమరనాథ్, రోజా పిచ్చి కుక్క ల్లాగా మొరుగుతున్నారని, వారికి తగిన బుద్ధి చెబుతామని జనసేన 42వ డివిజన్ అధ్యక్షు రాలు తిరుపతి అనూష హెచ్చరించారు. శనివా రం భవానీపురంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో తిరుపతి అనూష మాట్లాడారు.

30న స్విమ్మింగ్ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కష్ణాజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 30వ తేదీన ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధి పి.బాల మురళీకష్ణ తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ కె.స్టాలిన్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. 15వ తేదీ ఉదయం 11 గంటల నుండి 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 21వ తేదీ నామినేషన్ల పరిశీలన, 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు వెసులుబాటు ఉంటుందని ఎన్నికల అధికారి కె.స్టాలిన్ వెల్లడించారు. 30వ తేదీ ఎన్నికలు, ఫలితాల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు.



కట్టలేరు డైవర్షన్ రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక కట్టలేరు వంతెన ధ్వంసం అవడంతో నాలుగేళ్లుగా డైవర్షన్ రహదారే ప్రయాణికులకు దిక్కుగా మారింది. పలుమార్లు అధిక వర్షాలకు కొట్టుకు పోయిన ప్పటికీ దాతలు సహ కారంతో పునరుద్ధరిం చారు. రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణానికి మళ్లీ ఇబ్బందులు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న శ్రీ లక్ష్మీ స్టోన్ క్రషర్ యాజమాన్య సహకా రంతో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఈ నిర్వహణ కార్యక్రమం వినగడప పిఎసిఎస్ చైర్మన్ పెమ్మిరాజు ఆంజనేయులు చేపట్టారు. దీనితో మరికొద్ది కాలం ప్రయాణికులకు ఊరట.